# దగాపడ్డ గిరిజన మహిళ

## అడవీ తల్లీకీ దండాలూ
## మా తల్లీ అడవీకీ దండాలూ

అంటూ ప్రశాంతంగా సాగిపోతున్న అడవి తల్లి బిడ్డల బతుకులు నాగరికుల నయవంచన కారణంగా క్రమంగా అల్లకల్లోలమవుతున్నాయి. అందమైన అడవి తల్లి ఒడిలో పెరుగుతున్న గిరిజన యువతులకు మోసం అనేది తెలియదు. చెయ్యి పట్టిన వాడే తనకు తోడైనవాడు అనే సంప్రదాయంలో పెరిగిన ఆమెకు మూడుముళ్ల మాంగల్యం తెలియదు. అగ్నిసాక్షిగా జరిగే పెళ్లి గురించి తెలియదు. ఆమెకు తెలిసింది తన సాటి మని [illegible] చేసింది. నగరం, నాగరీకులు ఆమె జీవితంలో ప్రవేశించి వంచనకు గురిచేశారు. నగరవాసులు చేసిన ఈ మోసాలకు దగాపడిన గిరిజన మహిళలు 'అప్రకటిత శిక్షలు' అనుభవించాల్సి వస్తోంది.

గత రెండు దశాబ్దాలుగా గిరిజన ప్రాంతాలతో నగరాలకు అనుబంధం పెరిగింది. ఈ క్రమంలో మూడు రకాల వ్యక్తులు ఏజెన్సీ గ్రామాల్లోకి ప్రవేశించి గిరిజన మహిళల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. వీరిలో మొదటి రకం ఫారెస్టు కాంట్రాక్టర్లు. వీరు అడవుల్లోని విలువైన కలపను పట్టణాలకు చేర్చి లక్షలు గడిస్తున్నారు. కలప వ్యాపారం చాలా తక్కువ కాలంలో ఎక్కువ లాభాలు అందిస్తుంది. స్మగ్లింగ్ చేసుకుంటే రూపాయికి రూపాయి లాభం. రెండవ రకం వారు ప్రభుత్వ ఉద్యోగులు. ఏజెన్సీ ప్రాంతంలో ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను అమలుజరిపేందుకు ఈ రెండు దశాబ్దాల కాలంలో చాలా కృషి జరిగింది. మారుమూల గ్రామాల్లో కూడ ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలు, ఆసుపత్రులు, గిరిజన సహకార సంస్థలు వెలిశాయి. దీనితో నగరాల నుండి పెద్ద సంఖ్యలో ఉద్యోగులు గిరిజన [illegible] కొంతమంది ఉద్యోగులను క్రమశిక్షణా చర్యల్లో భాగంగా ఏజెన్సీలకు బదిలీ చేశారు. మూడవ రకం వారు ఏజెన్సీ ప్రాంతంలో తక్కువ ధరకు లభించే భూమిని సొంతం చేసుకోటానికి వచ్చినవారు.

ఇలా వారి వారి కారణాలతో ఏజెన్సీలోకి ప్రవేశించిన నగర వాసులతో గిరిజనులు అనివార్యంగా కలిసి జీవించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ క్రమంలో కొంతమంది గిరిజనుల్లో పట్టణాలకు వెళ్లాలని, వాటి సుఖాలు చవి చూడాలన్న కాంక్ష పెరిగింది. సాధారణంగా గిరిజన మహిళలు సర్వస్వతంత్రంగా వ్యవహరిస్తారు. గిరిజన సంప్రదాయాల్లో నిర్బంధం, మనసుకి ఇష్టం లేని పనులతో



గిరిజన మహిళలు



సరిపెట్టుకుంటూ కాలం గడపడం జరగదు. స్త్రీ, పురుషుడు కలిసి జీవించటమే వారి దృష్టిలో పెళ్లి అయినట్టు. ఎవరి కష్టం వారు చేస్తారు. కనుక పరస్పర గౌరవంతో కాపురాలు చెయ్యాలి. ఒక స్త్రీకి తన భర్తతో కాపురం చెయ్యటం ఇష్టం లేకపోతే వదిలి వెళ్లిపోతుంది. ఇలా సహజంగానే స్వతంత్రంగా వ్యవహరించే గిరిజన మహిళలు నగరాల నుంచి వచ్చిన వాళ్ల మాటలను నమ్మారు. నాజూకు మాటలు, ఆకర్షణతో నిండిన వర్చస్సు వారిని ఎన్నో భ్రమలకు లోను చేశాయి.

ఏజెన్సీ ప్రాంతంలో ఉద్యోగానికి వచ్చినవారు ఒకటి, రెండు సంవత్సరాలు అక్కడ వుండి మళ్లీ నగరాలకి వెళ్లిపోదామనే ఉద్దేశంలో వుంటారు. చదు

వుల కోసం పిల్లల్ని, కుటుంబాన్ని పట్టణాల్లో వుంచి తాము ఒంటరిగా గిరిజన గ్రామాల్లో వుంటారు. అప్పుడు వారు మొదట ఆకర్షించుకునేది స్థానిక మహిళలనే. గిరిజన సాంప్రదాయం ప్రకారం కలిసి వుండడమే పెళ్లి అయినట్టు కాబట్టి దాన్ని సాకుగా తీసుకుని పెళ్లి అయినట్టు నటించి తమ అవసరం తీరిపోయిన తర్వాత, బదిలీ అయిపోగానే రాత్రికి రాత్రే చెప్పా పెట్టకుండా వెళ్లిపోతున్నారు. గ్రామాల్లో భూముల్ని స్వాధీనం చేసుకుందామని వచ్చినవారు క్రమంగా గ్రామం మీద కూడా పట్టు సంపాదించుకున్నారు. గ్రామస్తులను తమ చెప్పుచేతల్లో వుంచుకునేందుకు స్థానికుల్లో చాలామందిని తమ వైపు ఆకర్షించుకున్నారు. అలా ఆకర్షితులైన మగవారిని తమ అనుచర బృందంగా చేసుకున్నారు. స్త్రీలను పెళ్లిళ్లు చేసుకున్నట్టు నటించి బంధుత్వం కలుపుకున్నారు. గిరిజన గ్రామాల్లో భూములపై గిరిజనేతరులకు చట్టపరమైన హక్కులను ప్రభుత్వం రద్దుచెయ్యటంతో తమ ఆస్తుల రక్షణకు గిరిజన మహిళలను అడ్డుపెట్టుకున్నారు. తమ ఆస్తులను ఆమె పేరుతో పెట్టి చివరకు ఆమెను వుంపుడుగత్తెగా తయారు చేశారు. అలాగే కలప కోసం వచ్చిన ఫారెస్టు కాంట్రాక్టర్లతోనూ, వారి సిబ్బందితోనూ గిరిజన మహిళలు కలిసి జీవించి, వారితో పెళ్లి

జరిగిందని పొంగిపోయి పిల్లల్ని కన్నారు.

ఇలా మోసపోయిన మహిళల సంఖ్య ఏజెన్సీ ప్రాంతంలో నానాటికీ పెరుగుతోంది. వీరి సమస్యలు అన్నీ ఇన్నీ కావు. గిరిజనులను కాదని నగరవాసిని పెళ్లాడింది కాబట్టి ఆమె శిక్ష అనుభవించాలనే ధోరణిలో స్థానికులు వ్యవహరిస్తున్నారు. అంతవరకూ మరో రకమైన సుఖమైన జీవితానికి అలవాటు పడిన గిరిజన స్త్రీలు తిరిగి గతంలో వలె పోడు వ్యవసాయం చేయలేరు. సాంప్రదాయ రీతిలో కాయకష్టం చేయలేరు. ఈ పరిస్థితుల్లో ఆమె, ఆమె పిల్లల జీవితం ఓ ప్రశ్నార్థకం అవుతుంది. 'దొర రాక కోసం' చూసి చూసి కళ్లు అలసిపోతాయి. చివరకు మళ్లీ ఎవరికో ఒకరికి వుంపుడుగత్తెగా మారుతుంది. లేకపోతే పుట్టింటికి చేరి ఒంటరిగా మనుగడ సాగిస్తుంది. అదీ సాధ్యం కాకపోతే వ్యభిచారానికి సిద్ధపడుతుంది. అదీ కుదరకపోతే

ఆత్మహత్యకు పాల్పడుతుంది.

అయితే రోజులన్నీ ఒకేలా వుండవు. మార్పు వస్తుంది. అలాగే గిరిజన మహిళల్లో కూడా చాలా మార్పు వచ్చింది. ఇంతకు ముందులాగా తమకు అన్యాయం జరిగితే మౌనంగా వుండడం లేదు. న్యాయం చెయ్యమని కోర్టులకు వస్తున్నారు. స్వచ్ఛంద సంస్థలు వారిని మరింత చైతన్యవంతం చేస్తున్నాయి. కానీ మన న్యాయ స్థానాల్లో జరిగే సుదీర్ఘ విచారణలతో గిరిజనులు విసుగు చెందుతున్నారు. అర్థంకాని న్యాయశాస్త్ర పద ప్రయోగాల మధ్య ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. సున్నితమైన ఈ అంశంలో ఒక మహిళ అందులోనూ గిరిజన మహిళ తనకు అన్యాయం జరిగిందని బాహ్య ప్రపంచానికి తనంతట తాను చెప్పటానికి మానసికంగా ఎంతో సంసిద్ధం కావాలి. దానికి తోడు కోర్టు వరకు రావటానికి మరింత దైర్యం కావాలి. అలా న్యాయం

అందించలేకపోతోంది.

రంపచోడవరం పరిధిలో దాదాపు 30 మంది మహిళలు తమకు జరిగిన అన్యాయంపై కోర్టులకు వెళ్ళారు. ఇప్పటికీ తమకు జరిగిన అన్యాయంపై కోర్టు ఆవరణకు రాని గిరిజన మహిళలు ఎంతో మంది వున్నారు. తీరా కోర్టుకు వెళ్ళిన వారికి ఏమి న్యాయం జరిగింది అనే నిరుత్సాహం వీరిలో పెరుగుతోంది.

ఈ మొత్తం పరిణామంలో దగాపడిన మహిళల సంతానం తమ భవిష్యత్ ఏమిటని ప్రశ్నిస్తున్నారు. అభిజ్ఞాన శాకుంతలంలో భరతుడు రాజ్యం చేశాడు. ఈ అభినవ శాకుంతలంలో జాడలేని దుష్యంతుల వయవంచనకు విషాద గుర్తుగా మిగిలిన భావితరాలు ఇలా ప్రశ్నిస్తున్నాయి 'మా నాన్న ఇక రాడా!'

(పక్క పేజీ తరువాయి)

# గిరిజన మహిళ ఒంటరి కాదు

– 'శక్తి' సంస్థ శారదాదేవి

అడవుల్లో ఏదో మారుమూల గ్రామాల్లో సభ్య సమాజానికి దూరంగా వుండే ఎందరో గిరిజనులు ఇప్పటికీ తమ గ్రామ పొలిమేర్లు వదిలి బయటకు రారు. గ్రామ పరిహద్దుల్లోనే పోడు వ్యవసాయం చేసుకుంటూనో, పొలం పనుల్లో నిమగ్నమయ్యో వుంటారు. ఇలాంటి స్థితిలో ఇతర ఊళ్ళ నుండి వచ్చి దగాచేసిన వారి గురించి ఎవరికి చెప్పుకోవాలని, తమకు జరిగిన అన్యాయాన్ని గురించి ఎవరికి విన్నవించుకోవాలి అనే ఆవేదనతోనే సంవత్సరాలు గడిచిపోయాయి.



ప్రస్తుతం వారికొక చిరునామా దొరికింది. అదే 'శక్తి' స్వచ్ఛంద సేవా సంస్థ. ఆ సంస్థ నిర్వాహకురాలు శ్రీమతి శారద శివరామకృష్ణ తన భర్త డాక్టర్ పి.శివరామకృష్ణ బాటలోనే స్వచ్ఛంద సంస్థ నిర్వహణ చేపట్టారు.

ఏజెన్సీ ప్రాంతంలో కేవలం ప్రభుత్వ పథకాల వలనే గిరిజనులు చైతన్యం కారు. కొన్ని స్వచ్ఛంద సంస్థలు సైతం అవసరమని ఎందరో మేధావులు గుర్తించారు. గిరిజనుల కోసం గత అనేక సంవత్సరాలుగా పోరాడుతున్న 'శక్తి' దగాపడిన గిరిజన మహిళల పక్షాన కోర్టులో కేసులు నడుపుతుంది.

గిరిజన మహిళలకు అండగా నిలుస్తున్న శ్రీమతి శారదాదేవి కోర్టులో జరుగుతున్న జాప్యం వల్ల నిరుత్సాహ పరిస్థితులు ఏర్పడుతున్నాయని అన్నారు. ఆమెతో జరిపిన ఇంటర్వ్యూలో కొన్ని ముఖ్యాంశాలు.

ప్రశ్న: గిరిజన మహిళ ప్రధానంగా ఎందుకు మోసపోతుంది?

జవాబు: గిరిజన ప్రాంతాల్లో సరైన విద్యా సదుపాయాలు లేవు. అందువల్ల గిరిజన మహిళలు ఎక్కువమంది నిరక్షరాస్యులుగా వుంటున్నారు. అమాయకంగా నమ్మే ఆమె స్వభావం ఆమెను దగా అయ్యేలా చేస్తుంది. గిరిజన మహిళల్ని అక్షరాస్యులు చేసి, మోసాలు ఎలా జరుగుతాయో వివరిస్తే ఎంతో మేలు జరుగుతుంది.

ప్రశ్న: దగాపడిన గిరిజన మహిళలు కోర్టుల్లో ఎదుర్కొంటున్న ఇబ్బందులు ఏమిటి?

జవాబు: న్యాయస్థానాల్లో కోర్టు భాష ఆమెకు పెద్ద సమస్య. నిరక్షరాస్యురాలైన ఆమె తర్జన భర్జనల్లో ఉక్కిరి, బిక్కిరి అవుతుంది. అసలు కోర్టుకు వచ్చిన మహిళలు ప్రాథమిక దశలోనే రెండు సంవత్సరాలు కోర్టు చుట్టూ తిరగాల్సి వస్తుంది. ఒక కేసు పూర్తిగా పరిష్కారం అయ్యేసరికి కనీసం 10 సంవత్సరాలు పడుతుంది. ఇంతా చేసి కోర్టులో గెల్చినా, భరణం ఇవ్వకపోయినా ఆమె ఏమీ చెయ్యలేదు. భరణం ఇవ్వడంలేదని కేసు పెడితే, అతను జైల్లో వున్న రోజులకు భోజనం మహిళే భరించాలి. ఇదంతా చూసి కోర్టుకు రావాలి అంటే ముందు వున్న ఉత్సాహం తరువాత వుండడం లేదు.

ప్రశ్న: ఈ పరిస్థితుల్లో మహిళలకు న్యాయం చేయాలి అంటే ఏమి చేయాలి?

జవాబు: సత్వరమే కోర్టు తీర్పు వస్తే ఎక్కువ ఉపయోగం వుంటుంది. నా వద్దకు వంద కేసులు వచ్చాయి. కాని ఏం చెయ్యను?

ప్రశ్న: గిరిజన మహిళలకు మీ సంస్థ ఏమి చేస్తుంది?

జవాబు: నీవు ఒంటరిగా లేవు అనే ధైర్యం చెబుతుంది. ఎలా పోరాడాలో నేర్పిస్తుంది.